జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
భద్రాద్రి కొత్తగూడెం
ఆదివారం | 10 | మే | 2026 ◆ పేజీలు : 6



# సింగరేణికి కొత్త గనులు

- 9 కొత్త గనుల ఏర్పాటుకు వేగంగా చర్యలు
- ఉపాధి, ఇంధన అవసరాల దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వ చొరవ




**కొత్తగూడెం, మే 9 (ప్రజాజ్యోతి)** సింగరేణి సంస్థ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని రాష్ట్ర ప్రభుత్వం కొత్త గనుల ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి సారించింది. బొగ్గు నిల్వలు తగ్గుతూ కొన్ని గనులు మూతపడుతున్న నేపథ్యంలో ఉత్పత్తి లోటును భర్తీ చేయడంతో పాటు కార్మికులకు ఉపాధి అవకాశాలు కొనసాగించేలా 9 కొత్త ప్రాజెక్టులకు

మిగతా 2 లో...

# తుమ్మల... సేవ కు @40

5 లో..



- ప్రజా రాజకీయాల్లో అరుదైన అధ్యాయం
- రాజకీయంలో అవినీతి మచ్చపడని నేత
- 4గురు ముఖ్యమంత్రుల దగ్గర 20 సంవత్సరాల మంత్రిగా పనిచేసిన చరిత్ర
- ఉమ్మడి ఖమ్మం జిల్లాలో మారుమూలకి వెళ్లిన తుమ్మల చేసిన అభివృద్ధి కనిపిస్తుంది
- రైతు బంధువుగా "ఆయిల్ పామ్" తో రైతును రాజుగా నిలిపిన రైతన్న

తుమ్మల నాగేశ్వరరావు పేరు వినగానే ప్రజలకు గుర్తుకొచ్చేది అభివృద్ధి, నిబద్ధత, నిరాడంబర రాజకీయాలు. నాలుగు దశాబ్దాల రాజకీయ ప్రస్థానంలో ఎన్నో పదవులు చేపట్టినా, అవినీతి మచ్చ పడకుండా ప్రజల మనసుల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకున్న నేతగా తుమ్మల నిలిచారు. అధికారాన్ని ఆస్తిగా కాకుండా, సేవకు సాధనంగా భావించిన ఆయన ప్రయాణం నేటి రాజకీయాల్లో అరుదైన ఉదాహరణగా నిలుస్తోంది.

అశ్వారావుపేట, ప్రజాజ్యోతి

# ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలి

- ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియపై ప్రత్యేక దృష్టి సారించాలి
- విద్యా వారోత్సవాలను విజయవంతం చేయాలి
- జిల్లా కలెక్టర్ అంకిత్



**కొత్తగూడెం కలెక్టరేట్, మే 9, (ప్రజా జ్యోతి )** వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. శనివారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు సంబంధిత ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో ధాన్యం కొనుగోలు, ఫార్మర్ రిజిస్ట్రీ, సెన్సస్, విద్యా వారోత్సవాలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి సమీక్షించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియను అన్ని జిల్లాల్లో వంద శాతం పూర్తి చేసేలా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. సెల్ఫ్ ఎన్యుమరేషన్‌కు ఒక్కరోజు మాత్రమే గడువు మిగిలి ఉండటంతో ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా పది లక్షలకు పైగా ప్రభుత్వ ఉద్యోగులు ఉన్నందున ప్రతి ఉద్యోగి స్వీయ గణన తప్పనిసరిగా పూర్తి చేసుకోవాలని అన్నారు . వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో

మిగతా 2 లో...

## భద్రాచలంలో భారీగా గంజాయి పట్టివేత



- రెండు స్కూటీల్లో 17 కిలోల 650 గ్రాముల ఎండు గంజాయి స్వాధీనం

**భద్రాచలం, మే 9, ప్రజాజ్యోతి :** భద్రాచలం పట్టణంలో ఎక్సైజ్ అధికారులు నిర్వహించిన తనిఖీల్లో భారీగా ఎండు గంజాయి పట్టుబడింది. రెండు స్కూటీల్లో తరలిస్తున్న 17 కిలోల 650 గ్రాముల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకొని ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. మరో స్కూటీకి సంబంధించిన వ్యక్తుల కోసం అధికారులు గాలింపు చర్యలు చేపట్టారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా

మిగతా 2 లో...



# జీవితానికి మూలం అమ్మ...

2 లో..

ఈ సృష్టిలో ఎలాంటి స్వార్థం లేకుండా ప్రేమించే హృదయం ఒక్కటే అది అమ్మది. తన బిడ్డ సంతోషం కోసం తన జీవితాన్నే అంకితం చేసే మహోన్నతమైన వ్యక్తిత్వం తల్లి. మనం ఈ ప్రపంచాన్ని చూడకముందే మన గురించి కలలు కనే తొలి మనిషి అమ్మే తొమ్మిది నెలలు గర్భంలో మోసి, ఎన్నో బాధలను భరించి, తన ప్రాణాలను సైతం పణంగా పెట్టి మనకు జన్మనిచ్చేది తల్లి మాత్రమే. బిడ్డ జన్మించిన క్షణం నుంచి తన జీవితాన్ని పిల్లల కోసమే అంకితం చేస్తుంది. అందుకే “జీవితానికి మూలం అమ్మ” అనే మాట ప్రతి మనిషి హృదయంలో చిరస్థాయిగా నిలిచిపోయింది.

-టి .రాజేష్ కుమార్, చర్ల మండల ప్రజా జ్యోతి రిపోర్టర్

## భద్రాచలంలో భారీగా గంజాయి పట్టివేత

(మొదటి పేజీ తరువాయి...)

ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ జనార్దన్ రెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ గణేష్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల ఆదేశాల మేరకు ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో అధికారులు భద్రాచలం ఆర్టీఏ కార్యాలయం సమీపంలో వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా అనుమానాస్పదంగా వస్తున్న ఒక స్కూటీని ఆపి తనిఖీ చేయగా అందులో 5 కిలోల 360 గ్రాముల ఎండు గంజాయి లభ్యమైంది. ఈ కేసులో యాదాద్రి భువనగిరి జిల్లాకు చెందిన ఇద్దరు వ్యక్తులు ఒడిశా రాష్ట్రం నుంచి గంజాయిని తరలిస్తున్నట్లు గుర్తించారు. వారిని అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు.అనంతరం సమీప ప్రాంతంలో అనుమానాస్పదంగా పార్క్ చేసి ఉన్న మరో స్కూటీని పరిశీలించగా అందులో 12 కిలోల 290 గ్రాముల ఎండు గంజాయి లభ్యమైంది. ఆ స్కూటీకి సంబంధించిన వ్యక్తుల కోసం ప్రత్యేక బృందాలు గాలింపు చర్యలు కొనసాగిస్తున్నాయి. పట్టుబడిన రెండు స్కూటీలు, ఒక సెల్‌ఫోన్‌తో పాటు మొత్తం రూ.10 లక్షల 52 వేల 500 విలువైన ఆస్తులను స్వాధీనం చేసుకొని తదుపరి విచారణ నిమిత్తం భద్రాచలం ఎక్సైజ్ స్టేషన్‌కు తరలించినట్లు అధికారులు తెలిపారు. ఈ తనిఖీల్లో హెడ్ కానిస్టేబుల్ ఖలీల్ అహ్మద్‌తో పాటు కానిస్టేబుళ్లు వెంకన్న, శివకుమార్, ప్రసన్నకుమార్, తిరుపతి, ఉపేందర్ పాల్గొన్నారు. గంజాయి, మత్తు పదార్థాల రవాణా లేదా విక్రయాలకు సంబంధించిన సమాచారం తెలిసిన వారు టోల్‌ఫ్రీ నంబర్ 18004252523కు సమాచారం అందించాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని ఎక్సైజ్ అధికారులు తెలిపారు.

## సింగరేణికి కొత్త గనులు

(మొదటి పేజీ తరువాయి...)

ప్రణాళికలు సిద్ధం చేశారు. ఈ ప్రాజెక్టులకు కేంద్ర బొగ్గు, అటవీ, పర్యావరణ శాఖల అనుమతుల కోసం ప్రతిపాదనలు పంపినట్లు సమాచారం. రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు ప్రత్యేక చొరవ తీసుకుని కేంద్ర అధికారులతో చర్చలు జరిపారు. ఇప్పటికే మూడు గనులకు అనుమతులు లభించగా ఒడిశాలోని నైనీ బ్లాక్‌లో బొగ్గు ఉత్పత్తి ప్రారంభమైంది. కొత్తగూడెంలోని వీకే కోల్ మైన్ కూడా తుది దశకు చేరుకుని త్వరలో ఉత్పత్తి ప్రారంభించనుంది. 2027–28 నాటికి నాలుగు గనులు మూతపడడంతో సంవత్సరానికి 12.51 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి తగ్గే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. అయితే కొత్తగా ప్రారంభించే ప్రాజెక్టుల ద్వారా ఈ లోటును భర్తీ చేయవచ్చని భావిస్తున్నారు. కొత్త ప్రాజెక్టులతో మరో 20 ఏళ్ల పాటు బొగ్గు ఉత్పత్తి కొనసాగించే అవకాశం ఉందని సింగరేణి వర్గాలు చెబుతున్నాయి. కొత్త గనుల ఏర్పాటుపై శనివారం సింగరేణి సీఎండీ డాక్టర్ బుద్ధ ప్రకాష్ జ్యోతి ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఈ ఏడాదిలో మూడు గనుల నుంచి ఉత్పత్తి ప్రారంభించేలా మిగిలిన అనుమతులను త్వరగా పొందాలని అధికారులను ఆదేశించారు.

## ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలి

(మొదటి పేజీ తరువాయి...)



రైతులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా తగిన ఏర్పాట్లు చేయాలని, కొనుగోలు ప్రక్రియలో జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఈ నెల 11వ తేదీ నుంచి నిర్వహించే విద్యా వారోత్సవాలను అన్ని శాఖలు సమన్వయంతో విజయవంతం చేయాలని కోరారు. ఐడీఓసీ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి సంబంధిత జిల్లా అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ అంకిత్ వీడియో కాన్ఫరెన్స్ అనంతరం మాట్లాడుతూ జిల్లాలో ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియను వేగవంతం చేసేందుకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికతో ముందుకు సాగాలని అధికారులను ఆదేశించారు. వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సమర్థవంతంగా నిర్వహించేందుకు సంబంధిత శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని సూచించారు. విద్యా వారోత్సవాలను ప్రభుత్వం నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం పకడ్బందీగా నిర్వహించి విజయవంతం చేయాలని తెలిపారు. అలాగే సెన్సస్ కార్యక్రమంపై సూపర్వైజర్లు, ఎన్యుమరేటర్లతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి పూర్తి స్థాయి దిశానిర్దేశం చేయాలని సంబంధిత శాఖల అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, పౌరసరఫరాల శాఖ జిల్లా అధికారి ప్రేమ్ కుమార్, వ్యవసాయ శాఖ అధికారి బాబురావు, మార్కెటింగ్ శాఖ అధికారి నరేందర్, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# జీవితానికి మూలం అమ్మ...

**ఈ సృష్టిలో ఎలాంటి స్వార్థం లేకుండా ప్రేమించే హృదయం ఒక్కటే అది అమ్మది. తన బిడ్డ సంతోషం కోసం తన జీవితాన్నే అంకితం చేసే మహోన్నతమైన వ్యక్తిత్వం తల్లి. మనం ఈ ప్రపంచాన్ని చూడకముందే మన గురించి కలలు కనే తొలి మనిషి అమ్మే తొమ్మిది నెలలు గర్భంలో మోసి, ఎన్నో బాధలను భరించి, తన ప్రాణాలను సైతం పణంగా పెట్టి మనకు జన్మనిచ్చేది తల్లి మాత్రమే. బిడ్డ జన్మించిన క్షణం నుంచి తన జీవితాన్ని పిల్లల కోసమే అంకితం చేస్తుంది. అందుకే "జీవితానికి మూలం అమ్మ" అనే మాట ప్రతి మనిషి హృదయంలో చిరస్థాయిగా నిలిచిపోయింది.**

-టి .రాజేష్ కుమార్, చర్ల మండల ప్రజా జ్యోతి రిపోర్టర్

- **అమ్మంటే అంతులేని ప్రేమ..**
- **అమ్మే మన ధైర్యం..**
- **అమ్మ ప్రేమ శాశ్వతం..**
- **నేడు ప్రపంచ మాతృదినోత్సవం..**




ప్రతి సంవత్సరం మే నెల రెండో ఆదివారం ప్రపంచవ్యాప్తంగా "మదర్స్ డే" లేదా "ప్రపంచ మాతృదినోత్సవం"గా నిర్వహిస్తారు. తల్లుల ప్రేమ, త్యాగం, సేవా భావం, అంకిత భావాన్ని స్మరించుకునే ప్రత్యేక దినంగా ఈ రోజును భావిస్తారు. అయితే అమ్మ చేసిన సేవలకు, ఆమె చూపిన ప్రేమకు కృతజ్ఞతలు చెప్పడానికి ఒక్క రోజు సరిపోదనే అభిప్రాయం ప్రతి ఒక్కరిలో వ్యక్తమవుతోంది. ఎందుకంటే తల్లి ప్రేమకు హద్దులు లేవు ఆమె త్యాగాలకు కొలమానం లేదు.ఒక బిడ్డ జన్మించిన తర్వాత తల్లి జీవితం పూర్తిగా మారిపోతుంది. తన నిద్రను, ఆరోగ్యాన్ని, ఆనందాలను పక్కనబెట్టి పిల్లల భవిష్యత్తు కోసం నిరంతరం శ్రమిస్తుంది. బిడ్డ చిన్నగా ఏడ్చినా గుండె తల్లడిల్లిపోతుంది. పిల్లలు నవ్వితే ప్రపంచాన్ని గెలిచినంత ఆనందపడేది తల్లే పిల్లలు ఆకలితో ఉండకూడదని తన ఆకలిని మరిచిపోతుంది. పిల్లలకు అనారోగ్యం వస్తే రాత్రింబవళ్లు నిద్ర మానేసి సేవ చేస్తుంది. పిల్లలు ఉన్నత స్థానాలకు చేరాలని ప్రతి క్షణం ఆలోచిస్తూ కష్టపడేది అమ్మ మాత్రమే.మనిషి జీవితంలో తొలి గురువు కూడా తల్లే. మాటలు నేర్పేది అమ్మే నడక నేర్పేది అమ్మే మంచి చెడు తెలియజేసేది అమ్మే.. ప్రేమ, మానవత్వం, సంస్కారం, కుటుంబ విలువలను బోధించేది తల్లే తల్లి ఒడిలోనే మనిషి తొలి భద్రతను, తొలి ప్రేమను అనుభవిస్తాడు. అందుకే అమ్మ ఒడిని ప్రపంచంలోనే అత్యంత సురక్షితమైన స్థలంగా భావిస్తారు. చిన్ననాటి నుంచి పిల్లల ప్రతి అడుగులోనూ తోడుగా నిలిచి వారి విజయాల కోసం నిరంతరం ప్రార్థించే పవిత్ర హృదయం తల్లిదే.తాను కష్టపడి పనిచేస్తూనే ఇంటి బాధ్యతలను నిర్వర్తించే తల్లులు ఒకవైపు ఉంటే, పట్టణాల్లో ఉద్యోగాలు నిర్వహిస్తూ కుటుంబాన్ని సమర్థంగా నడిపించే తల్లులు మరోవైపు కనిపిస్తున్నారు. కాలం మారినా, పరిస్థితులు మారినా, సాంకేతికత ఎంత అభివృద్ధి చెందినా తల్లి ప్రేమ మాత్రం ఎప్పటికీ మారదనే విషయం స్పష్టమవుతోంది. పిల్లలపై ఆమె మమకారం కాలంతో తరగదు దూరం తగ్గదు. అయితే నేటి ఆధునిక జీవనశైలిలో కుటుంబ బంధాలు క్రమంగా దూరమవుతున్నాయనే ఆందోళన వ్యక్తమవుతోంది. పాశ్చాత్య సంస్కృతి ప్రభావం, ఉద్యోగాలు, విదేశీ విద్య, వ్యాపారాల కారణంగా అనేక మంది పిల్లలు తమ తల్లిదండ్రులకు దూరంగా ఉంటున్నారు. కొందరు తమ తల్లిదండ్రులను వృద్ధాశ్రమాల్లో చేర్పిస్తున్నారు.కొందరు వృద్ధ తల్లులు వృద్ధాశ్రమాల్లో జీవిస్తూ పిల్లల కోసం ఎదురుచూస్తున్న పరిస్థితులు సమాజాన్ని కలచివేస్తున్నాయి.జీవితాంతం పిల్లల కోసం కష్టపడిన తల్లులు చివరికి ఒంటరితనంలో జీవించడం బాధాకరం. అయినప్పటికీ తల్లి హృదయం మాత్రం ఎప్పటికీ పిల్లల కోసమే కొట్టుకుంటుంది. పిల్లలు ఒక్కసారి "అమ్మ" అని పిలిచినా ఆమె కళ్లలో ఆనందభాష్పాలు మెరిసిపోతాయి.మదర్స్ డే అనేది కేవలం శుభాకాంక్షలు చెప్పుకునే రోజు మాత్రమే కాదు తల్లి చేసిన త్యాగాలను గుర్తు చేసుకుని ఆమెకు కృతజ్ఞతలు తెలియజేసే రోజు కూడా చిన్నప్పుడు మన చేతిని పట్టుకుని నడిపించిన తల్లికి వృద్ధాప్యంలో అండగా నిలవాల్సిన బాధ్యత ప్రతి బిడ్డపై ఉంటుంది . తల్లితో కొంత సమయం గడపడం, ప్రేమగా మాట్లాడడం, ఆమె ఆరోగ్యం గురించి తెలుసుకోవడం, ఆమె మనసును అర్థం చేసుకోవడం వంటి చిన్న విషయాలే ఆమెకు ఎంతో ఆనందాన్ని ఇస్తాయి. "అమ్మ" అనే పదం చిన్నదే అయినా అందులో అనంతమైన ప్రేమ దాగి ఉంటుంది. దేవుడిని మనం చూడకపోయినా అమ్మ రూపంలో ఆయన ప్రేమను అనుభవిస్తామని పెద్దలు చెబుతుంటారు. మన విజయాల వెనుక అమ్మ కన్నీళ్లు ఉంటాయి. మన చిరునవ్వుల వెనుక ఆమె త్యాగం ఉంటుంది..మన ధైర్యం వెనుక అమ్మ ఆశీస్సులు ఉంటాయి. మన జీవితంలో ఎన్నో బంధాలు వచ్చినా ఎన్ని విజయాలు సాధించినా చివరివరకు మన పక్కన నిలిచేది తల్లే ఆమె ప్రేమకు ప్రత్యామ్నాయం లేదు ఆమె స్థానాన్ని ఎవరూ భర్తీ చేయలేరు .నేటి సమాజంలో తల్లిదండ్రులను గౌరవించడం, వారి భావాలను అర్థం చేసుకోవడం, వృద్ధాప్యంలో వారికి తోడుగా నిలవడం ప్రతి ఒక్కరి బాధ్యతగా మారాల్సిన అవసరం ఉందని సామాజిక వేత్తలు సూచిస్తున్నారు. అమ్మ ప్రేమను మాటల్లో చెప్పలేం ఆమె త్యాగానికి విలువ కట్టలేం అమ్మే మన తొలి దేవత అమ్మే మన జీవితం అమ్మే మన ప్రపంచం అమ్మ ప్రేమ ఎప్పటికీ శాశ్వతం... ఈ అనంత కోటి విశ్వంలోని ప్రతి మాతృమూర్తికి మాతృ దినోత్సవ శుభాకాంక్షలు..



# ధాన్యం తడిసిపోతున్న పట్టించుకునే వారెవ్వరు



**ఇల్లందు, మే 9, ప్రజాజ్యోతి:** ఆరుగాలం కష్టించి పండించిన ధాన్యం తడిసిపోతున్న పట్టించుకునే వారెవ్వరని మాజీ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దుండిగల రాజేందర్ ప్రశ్నించారు. శనివారం మండలం లోని రేపల్లెవాడ గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బిఆర్ఎస్ బృందంతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన ధాన్యాన్ని సకాలంలో సేకరించటం లేదని, ధాన్యాన్ని తెచ్చి రోజుల తరబడి ఎదురుచూడాల్సి వస్తుందని, సరైన వసతులు లేక తార్పాలిన్ లు లేక ధాన్యం తడిసిపోతున్నా పట్టించుకునే నాధుడు లేరని అగ్రహం వ్యక్తం చేశారు. తడిసిన ధాన్యాన్ని కొనటం లేదని, బస్తా, బస్తాకు తరుగు తీస్తున్నారని, గన్ని బ్యాగ్స్ సప్లై చేయటం లేదని, మార్కెట్ ధరకన్నా తక్కువ ధర చెల్లిస్తున్నారని తెలిపారు. మార్కెట్ లో దళారీలు రాజ్యం ఎలుతున్నారని, రైతుల పొట్టగొట్టి లాభాలు గడిస్తున్నారని, మార్కెర్ కమిటీ అధికారులు దళారీలకు కొమ్ముగాస్తున్నారని ఆరోపించారు. గతంలో కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఈ బాధలు లేవని, గిట్టుబాటు ధర కల్పించటంతో పాటు ధాన్యం సకాలంలో కొన్నారని, తడిసిన రంగుమారిన ధాన్యాన్ని కూడా కొనేవారని గుర్తు చేశారు. కాంగ్రెస్ సర్కార్ వచ్చాక రైతుల కష్టాలు పెరిగిపోయాయని, రైతుబంధు రాక, విత్తనాలు దొరకక, యూరియా లేక, ముఖ్యమంత్రి మాటలు కోటలు దాటినా చేతలు గడప దాటటం లేదని విమర్శించారు. మార్కఫెడ్ జిల్లా మేనేజర్, పిఎసియస్ సిఈఓ తో మాట్లాడి రైతులకు న్యాయం చేయాలని, ధాన్యం వెంటనే కొనుగోలు చేయాలని దళారీ వ్యవస్థను అరికట్టాలని లేకుంటే పెద్దఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు వేప శంకర్, ఎట్టి రమణ, నాయకులు ఆజ్మీరా బావు సింగ్ నాయక్, మహమ్మద్ జబ్బార్, అబ్దుల్ నబీ, దాస్యం ప్రమోద్, దేరంగుల పోషం, ఘాజి, మూడు కృష్ణ ప్రసాద్, సూర్ణపాక సత్యనారాయణ, నారపాక వసంతరావు, ఆధురి రవి, రాంలాల్ పాసి, రాచపల్లి శ్రీను, సుందరి శ్రీను, వాసు, సునీల్, మూలగుండ్ల ఉపేందర్ రావు, లలిత్ కుమార్ పాసి, శ్రీకాంత్, హరి ప్రసాద్ యాదవ్, సురేష్, ఉదయ్,గడ్డి శ్రీను, చిన్నారి, ముత్తయ్య, రాజు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అసత్య ఆరోపణలు మానుకోవాలి



**ఇల్లందు, మే 9, ప్రజాజ్యోతి:** తాను, తన కుటుంబసభ్యులపై 13వ వార్డు కౌన్సిలర్ దండు సారయ్య అసత్య ఆరోపణలు చేయడం మానుకోవాలని కో ఆప్షన్ సభ్యుడు సాంబ మూర్తి సూచించారు. శనివారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఎన్నికల వరకే రాజకీయాలు అని, ఆ తర్వాత ప్రజలకు అవసరమైన మౌలిక, వ్యక్తిగత అవసరాలతో పాటు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని గుర్తు చేశారు. ప్రజా సేవకు అధికారమే అవసరం లేదని, రాజకీయాలు, సామాజిక సేవలో ఉన్న ప్రతి ఒక్కరూ ప్రజా అవసరాలను గుర్తించి వారికి అవసరమైన అన్నిటిని సాధ్యమైనంతవరకు వారికి అందించడమే ముఖ్య కర్తవ్యంగా పనిచేయాల్సి ఉందన్నారు. ఈ విషయాలను మరచి తన వ్యక్తిగత అవసరాలకు అనుగుణంగా ప్రజలను మభ్యపెట్టాలని ప్రయత్నించడం స్థానిక కౌన్సిలర్ కు అలవాటుగా మారిందని ఆరోపించారు. 13వ వార్డు కౌన్సిలర్ దండు సారయ్య గెలిచిన తర్వాత తన విధులను మరచి ఇతరులు చేస్తున్న మంచిని జీర్ణించుకోలేక తన కుటుంబ సభ్యులపై అసత్య ఆరోపణలతో పబ్బం గడుపుకుంటున్నాడని ఆరోపించారు. తనకు చేతగాని పనిని ఇతరులు చేస్తే తట్టుకోలేక చేస్తున్న ఆరోపణలను ప్రజలు గమనిస్తున్నారని పేర్కొన్నారు. రాజకీయంగా తనతో విభేదిస్తున్న కొంతమందిని పోగేసుకుని వచ్చి ఆరోపణలు చేయడం ఇకనైనా మానుకోవాలని హితవు పలికారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు ఏమైనా ఉంటే అధికారులను సంప్రదించి పరిష్కరించుకోవాలని సూచించారు. రాజకీయంగా ఎదుర్కోలేక ఒకరి మీద ఆరోపణలు మాని ప్రజా సమస్యలపై దృష్టిస్తారించాలని కోరారు.

## శ్రవణ నక్షత్ర వేళ ఘనంగా సుదర్శన హోమం

- భక్తులతో కిటకిటలాడిన శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం



**అన్నపురెడ్డిపల్లి, మే 9, ప్రజా జ్యోతి:** అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలో గల ప్రముఖ పుణ్యక్షేత్రము శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం శ్రవణ నక్షత్రం సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఇటీవల మహా కుంభాభిషేక మహోత్సవాలు అనంతరం వచ్చిన తొలి శనివారం కావడంతో ఆలయానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.మొట్టమొదటి సారిగా నరసింహ స్వామి ప్రతిష్ట అనంతరం సుదర్శన హోమాన్ని వైదిక పండితులు వేదమంత్రోచ్చారణల మధ్య ఘనంగా నిర్వహించారు. హోమ కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి ఆశీస్సులు పొందారు. ఆలయ ప్రాంగణం అంతా భక్తులతో కిటకిటలాడింది.శనివారం సందర్భంగా స్వామివారి కళ్యాణం చంద్రవైభవంగా నిర్వహించారు. కళ్యాణంలో పాల్గొన్న దంపతులు కుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ అర్చకులు భక్తులకు వేద ఆశీర్వచనాలు అందజేశారు. అలాగే ఆలయంలో అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా ఏర్పాటు చేశారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు సైతం అన్నప్రసాదాన్ని స్వీకరించి నిర్వాహకులను అభినందించారు. మహా కుంభాభిషేకోత్సవాల అనంతరం ఆలయంలో భక్తుల రద్దీ మరింత పెరిగిందని భక్తులు తెలిపారు.స్వామివారి కృపతో గ్రామానికి శాంతి, సస్యశ్యామలత్వం కలగాలని భక్తులు ప్రార్థించారు. ఆలయ అభివృద్ధికి భక్తుల సహకారం మరింత అవసరమని నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల నిర్వహణలో దేవాలయ ఈవో వెంకటరమణతో పాటు ఆలయ సిబ్బంది భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేశారు.

## రాజుపేట లో సైడ్ డ్రైన్ నిర్మాణం పనులను వెంటనే పూర్తి చేయాలి

- నిర్మాణానికి ఆటంకంగా ఉన్న కట్టడాలను తొలగించాలి
- గ్రామపంచాయతీ ఈ.వో.కు వార్డు ప్రజల వినతి



**భద్రాచలం టౌన్, మే 9 ప్రజాజ్యోతి** భద్రాచలం గ్రామపంచాయతీ అభివృద్ధి నిధులలో భాగంగా 20వ వార్డు పరిధిలో ఎమ్మెల్యే కాలనీలో ఐదు లక్షల రూపాయలతో చేపట్టిన డ్రైన్ నిర్మాణ పనులకు ఆటంకంగా మారిన కట్టడాలను వెంటనే తొలగించి డ్రైన్ నిర్మాణ పనులను పూర్తి చేయాలని సిపిఎం 20వ వార్డ్ మెంబర్ ఇర్పా అనసూయ ఆధ్వర్యంలో వార్డు ప్రజలందరూ శనివారం గ్రామపంచాయతీ ఈవో ను కలిసి వినతి పత్రం సమర్పించారు.. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ ఈవో శ్రీనివాసరావు మాట్లాడుతూ అభివృద్ధి పనులకు వచ్చే ఆటంకాలను తొలగించి సైడ్ డ్రైన్ నిర్మాణం పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎంబీ నర్సారెడ్డి పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి లు మాట్లాడుతూ వార్డు అభివృద్ధికి ప్రజలు పూర్తిస్థాయిలో సహకరించాలని అన్నారు. సిపిఎం గెలిచిన వార్డుల నందు అభివృద్ధి పనులు పారదర్శకంగా జరిగేందుకు కృషి చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో నాలుగో వార్డ్ మెంబర్ పార్టీ జిల్లా కమిటీ సభ్యులు బండారు శరత్ బాబు, పార్టీ పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు డి. సీతాలక్ష్మి, సీనియర్ నాయకులు, పార్టీ పట్టణ కమిటీ సభ్యులు నాదెళ్ల లీలావతి, డి. కనక శ్రీ, హైమావతి, బేగం, లక్ష్మీనారాయణ,పద్మ, సముద్రల రమణ,భషీర్,మల్లూరు,శ్రీదేవి,తదితరులు పాల్గొన్నారు.

## బుడగం శ్రీనివాస్ విధేయతకు దక్కిన గుర్తింపు

- శాసనసభ్యులు తెల్లం వెంకట్రావు
- పెరిక కార్పొరేషన్ వైస్ చైర్మన్ బుడగం శ్రీనివాస్ కి ఘన సన్మానం



**భద్రాచలం టౌన్, మే 9 , ప్రజాజ్యోతి** విద్యార్థి దశ నుండి కాంగ్రెస్ పార్టీకి విధేయతగా సేవలందిస్తున్న బుడగం శ్రీనివాస్ కి సముచిత స్థానం గౌరవం లభించిందని భద్రాచలం శాసనసభ్యులు తెల్లం వెంకట్రావు అన్నారు. శనివారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పెరిక కార్పొరేషన్ వైస్ చైర్మన్ గా ఎన్నికైన బుడగం శ్రీనివాస్ని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 40 ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి బొడుగం శ్రీనివాస్ రాజీ లేకుండా కృషి చేస్తున్నారని అన్నారు. బుడగం శ్రీనివాస్ కి పెరిక కార్పొరేషన్ వైస్ చైర్మన్ పదవి రావడం ఈ ప్రాంతానికే గర్వకారణం అని అన్నారు. బుడగం శ్రీనివాస్ కి లభించిన ఈ పదవితో మరింతగా ప్రజా సేవ చేయాలని కోరారు. పార్టీ కార్యకర్తలకు అండగా నిలుస్తూ పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. కార్పొరేషన్ ద్వారా పెరిక జాతి అభివృద్ధికి దుర్గం శ్రీనివాస్ కృషి చేయాలని అన్నారు.ముందుగా బుడగం శ్రీనివాస్ కి భద్రాచలం మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ పూణేం కృష్ణ శాలువా కప్పి అభినందించారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి జనరల్ సెక్రెటరీ నల్లపు దుర్గాప్రసాద్ ఎస్సీ సెల్ నాయకులు చింతిరాల రవికుమార్ జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధి సరళ నరేష్ బలుసు నాగ సతీష్ దొడ్డిపట్ల కోటేష్ రత్నం రమాకాంత్ భీమవరపు వెంకటరెడ్డి కాంగ్రెస్ పార్టీ పాలకవర్గ సభ్యులు బొంబోతుల రాజీవ్ బొంత రమణ నిట్ట రాజు దుర్గారావు ఉదయ్ కుమార్ పాల్గొని శ్రీనివాస్ కి అభినందనలు తెలియజేశారు.

## త్రివేణి స్కూళ్లలో నీడ మాయ సంబరాలు

- ఆసక్తిగా వీక్షించిన విద్యార్థులు.. ఆకట్టుకున్న ఖగోళ వింత

**లక్ష్మీదేవిపల్లి , మే 9 ( ప్రజాజ్యోతి )** ప్రపంచవ్యాప్తంగా ఆసక్తి రేకెత్తించే అరుదైన ఖగోళ దృగ్విషయం జీరో షాడో డే ను కొత్తగూడెంలోని త్రివేణి విద్యాసంస్థలు లో శనివారం ఘనంగా నిర్వహించారు. సూర్యుడు సరిగ్గా నడినెత్తిపైకి రావడంతో క్షణికంగా నీడ కనిపించకుండా పోయే ఈ అద్భుతాన్ని విద్యార్థులు ఉత్సాహంగా పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థుల కోసం ప్రత్యేక పోటీలు నిర్వహించారు. నీడ మాయ దృశ్యాలను ఫోటోలు, వీడియోల రూపంలో చిత్రీకరించి విద్యార్థులు తమ ప్రతిభను ప్రదర్శించారు. పోటీల్లో పాల్గొన్న అందరికీ పాల్గొన్న ధ్రువపత్రాలు అందజేశారు. ప్రతిభ కనబరిచిన విజేతలకు ప్రతిభా పురస్కారాలు, ధ్రువపత్రాలు బహూకరించారు. ఈ కార్యక్రమంలో సంస్థ సీఆర్వో కె. మురళీకృష్ణ, ప్రిన్సిపాళ్లు శ్రీనివాస్ సింగ్, నేతాజీ, సూర్యనారాయణ మూర్తి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



## భద్ర్రాద్రి రామయ్యకు స్వర్ణ తులసార్చన

- నిత్యకల్యాణంలో అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తులు



**భద్రాచలం టౌన్, మే 9 ప్రజాజ్యోతి** భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయంలో శనివారం ఆర్జిత సేవలో భాగంగా స్వర్ణ తులసార్చన నిర్వహించారు. అలాగే నిత్యకల్యాణ మండపంలో స్వామి వారి నిత్యకల్యాణం వైభవంగా ఈ కల్యాణంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. స్వామి వారికి విశ్వక్సేనార్చన, పుణ్యహావచనం, కంకణదారణ, జీలకరబెల్లం, మాంగల్యదారణ, తలంబ్రాలు, వేద ఆశీర్వచనం నిర్వహించారు .

## గిరిజన విద్యార్థుల వేసవి శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమం



**భద్రాచలం టౌన్, మే 9, ప్రజాజ్యోతి** భద్రాచలం ఐటీడీఏ గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన గిరిజన ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాల విద్యార్థుల 15 రోజుల వేసవి శిక్షణ శిబిరం శనివారంతో ముగిసింది. ఈ సందర్భంగా శిక్షణ శిబిరం ముగింపు సమావేశంలో పి ఎమ్ ఆర్ సి ఏసీఎంవో రమేష్ పాల్గొని మాట్లాడుతూ ఈ సమ్మర్ క్యాంపులో నిర్వహించేది విద్యార్థినీ విద్యార్థులలో దాగివున్న నైపుణ్యాలను వెలికితీయడానికి, వారికి ఇష్టమైన క్రీడలు ఇతర కళలపట్ల మక్కువ కలిగించి ఉత్తములుగా తీర్చిదిద్దడానికి ఈ క్యాంపులు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. 15 రోజులుగా మీరు నేర్చుకున్న ప్రతి అంశాలను ప్రతిరోజు సాధన చేసి మీరు అనుకున్నది సాధించేవరకు విశ్రమించకూడదని అన్నారు. అనంతరం జి సి డి వో అలివేలు మంగతాయారు మాట్లాడుతూ 15 రోజుల వేసవి శిక్షణ శిబిరంలో విద్యార్థులు వారికి ఇష్టమైన కళలు, ఇతర అంశాలపై ప్రత్యేక శ్రద్ధ చూపి నేర్చుకొని పరిణితి చెందారన్నారు. అనంతరం విద్యార్థినీ విద్యార్థులు నేర్చుకున్న వివిధ అంశాలు వారి మనసులోని భావాలను విద్యార్థుల ద్వారా తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ ఎం క్యాంపు ఇంచార్జ్ సీహెచ్ సుభద్ర, అసిస్టెంట్ క్యాంపు ఇంచార్జ్ పి.జే నాగరాజు, హెచ్ డబ్ల్యూఓ వసంత్, పీడీ మహాలక్ష్మి , పీఈటీలు, రిసోర్స్ పర్సన్స్ నటరాజ్, అజ్మీరా విజయలక్ష్మి , నాగలక్ష్మి , సుజాత పాల్గొన్నారు.

## లాడ్జిలపై ఎస్పీ ఫోకస్

- నిబంధనలు ఉల్లంఘిస్తే లైసెన్స్ రద్దు
- లాడ్జి యాజమాన్యాలకు అవగాహన సదస్సు






**కొత్తగూడెం, మే 9 ( ప్రజాజ్యోతి )** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో లాడ్జిల నిర్వహణలో నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు స్పష్టం చేశారు. శనివారం కొత్తగూడెం పట్టణంలోని ఐ. ఎమ్. ఏ ఫంక్షన్ హాల్ లో జిల్లాలోని లాడ్జిల యాజమాన్యాలతో నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆయన పలు కీలక సూచనలు చేశారు. లాడ్జిలలో అసాంఘిక కార్యకలాపాలకు ఎట్టి పరిస్థితుల్లోనూ అవకాశం ఇవ్వొద్దని నేరాల నియంత్రణలో పోలీసులకు సహకరించాలని సూచించారు. ప్రతి అతిథి నుంచి ప్రభుత్వం జారీ చేసిన గుర్తింపు కార్డు తప్పనిసరిగా తీసుకోవాలని వారి పూర్తి వివరాలను రిజిస్టర్లో నమోదు చేయాలని తెలిపారు. విదేశీయులు లాడ్జిలలో బస చేస్తే వారి వివరాలను 24 గంటల లోపు Form–C ద్వారా పోలీసులకు సమర్పించాలని ఆదేశించారు. ప్రతి రోజు ఉదయం రిజిస్టర్ల సమాచారం గుర్తింపు కార్డుల జిరాక్స్ కాపీలను సంబంధిత పోలీస్ స్టేషన్‌కు అందించాలని పేర్కొన్నారు. లాడ్జిలలో ప్రవేశ ద్వారం, రిసెప్షన్, కారిడార్లు, బయట రోడ్డు స్పష్టంగా కనిపించేలా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి ఫుటేజీని కనీసం 30 రోజుల పాటు భద్రపరచాలని సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు, లగేజీ, గుంపులుగా బస చేసే వారిపై ప్రత్యేక నిఘా పెట్టాలని తెలిపారు. లాడ్జి గదుల్లో మద్యం సేవించడం, జూదం వంటి కార్యకలాపాలు జరిగితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని హెచ్చరించారు. స్థానిక ఎస్. హెచ్ ఓ ఫోన్ నంబర్లు రిసెప్షన్ వద్ద అందుబాటులో ఉంచాలని సూచించారు. ఫైర్ సేఫ్టీ నిబంధనలు కచ్చితంగా పాటించడంతో పాటు అత్యవసర ఎగ్జిట్, అలారం వ్యవస్థ ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. సిబ్బంది వివరాలపై పోలీసు వెరిఫికేషన్ చేయించుకోవడం మంచిదని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించే లాడ్జిలపై చట్టపరమైన చర్యలతో పాటు లైసెన్సులు రద్దు చేస్తామని జిల్లా ఎస్పీ హెచ్చరించారు.

# చెరువు మట్టితో భూమి సారవంతం

- నీటి వనరుల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత
- చెరువులను కాపాడుకోవాలని అధికారుల పిలుపు
- సమర్థ నీటి వినియోగంపై అధికారుల సూచనలు



**చర్ల, మే 09(ప్రజా జ్యోతి ):** చర్ల మండలంలోని పెద్ద చెరువు వద్ద శనివారం "ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక" రైతు వారోత్సవాల్లో భాగంగా చెరువుల పూడిక తొలగింపు భూగర్భ జలాల పరిరక్షణ సమర్థ నీటి వినియోగంపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నీటిపారుదల శాఖ ఉప కార్యనిర్వాహక ఇంజినీర్ తిరుపతి మాట్లాడుతూ చెరువులలోని పూడిక మట్టిలో పోషకాలు అధికంగా ఉండటంతో వాటిని పంట పొలాల్లో వినియోగిస్తే భూమి సారవంతం పెరిగి రైతులకు మేలు జరుగుతుందని తెలిపారు. చెరువుల ద్వారా భూగర్భ జలాలు పెరుగుతాయని వివరించారు. వ్యవసాయానికి అవసరమైన మేరకు మాత్రమే నీటిని వినియోగించి నీటి వనరులను సంరక్షించాలని రైతులకు సూచించారు. ప్రభుత్వం అనుమతులతో చెరువు మట్టిని రైతులు తమ సొంత ఖర్చులతో పొలాలకు తరలించుకోవచ్చని తెలిపారు. ఇందుకోసం కార్యనిర్వాహక ఇంజినీర్, భద్రాచలం కార్యాలయానికి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎంపీడీవో ఈదయ్య మాట్లాడుతూ నీరు మానవ జీవితానికి ప్రాథమిక అవసరమని పూర్వకాలంలో గ్రామాలు పట్టణాలు చెరువులు, నదుల పరిసరాల్లోనే అభివృద్ధి చెందాయని గుర్తు చేశారు. ప్రస్తుతం బోర్‌వెల్‌ల వినియోగం పెరగడంతో భూగర్భ జలాల మట్టాలు తగ్గుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. భూగర్భ జలాల పునరుద్ధరణలో చెరువులు కీలక పాత్ర పోషిస్తాయని, అందుకే పూడిక తీత కార్యక్రమాలు అవసరమని తెలిపారు. ఎంఆర్వో శ్రీనివాస్ మాట్లాడుతూ చెరువులు, కాలువలను పరిరక్షించడం రైతుల బాధ్యత అని పేర్కొన్నారు. చెరువులో నుంచి తీసిన మట్టిని పంట పొలాల్లో మాత్రమే వినియోగించుకోవాలని సూచించారు. ఆత్మ కమిటీ చైర్మన్ బుచ్చిబాబు మాట్లాడుతూ కాకతీయుల కాలంలో నిర్మించిన గొలుసుకట్టు చెరువుల ప్రాముఖ్యతను వివరించారు. చెరువుల వ్యవస్థ వల్ల నీటి నిల్వలు పెరిగి వ్యవసాయానికి మేలు జరిగేదని తెలిపారు. ప్రస్తుతం ప్రభుత్వం చేపడుతున్న చెరువుల అభివృద్ధి కార్యక్రమాలు రైతులకు ఉపయోగకరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో ఈదయ్య, ఆత్మ కమిటీ చైర్మన్ బుచ్చిబాబు ,ఎంజీఎన్ఆర్ఈజీఎస్ ఏపీఓ సాంబశివరావు, ఇరిగేషన్ సహాయక కార్యనిర్వాహక ఇంజినీర్ సంపత్, సహాయక ఇంజినీర్ సుమన, చెర్ల పంచాయతీ కార్యదర్శి సురేష్, రైతులు గ్రామస్తులు పాల్గొన్నారు.

## మూగజీవాల మృత్యుఘోష

- విద్యుత్ తీగలు తెగిపడి రైతు ఆశల ప్రాణం పోయింది.





**టేకులపల్లి,మే09,ప్రజాజ్యోతి:** ప్రకృతి కన్నెర్ర చేసిన వేళ ఆ నిరుపేద రైతు సంసారానికి ఆసరాగా నిలిచిన మూగజీవాలు విగతజీవులుగా మారాయి. శనివారం కురిసిన ఈదురు గాలుల బీభత్సానికి తుమ్మల చిలక గ్రామానికి చెందిన మంగమ్మ, బుచ్చయ్య, ఉకే సర్వేష్‌లకు చెందిన మూడు ఎద్లు మేతకు వెళ్లి విగతజీవులుగా తిరిగివచ్చాయి. గాలివాన ధాటికి త్రీఫేస్ విద్యుత్ తీగలు తెగిపడటంతో,అటుగా వెళ్తున్న ఆ మూగజీవాలు విద్యుత్ షాక్ కు గురై అక్కడికక్కడే ప్రాణాలు విడిచాయి.కళ్లముందే ప్రాణప్రదంగా పెంచుకున్న ఎద్లు విగతజీవులై పడి ఉండటాన్ని చూసి ఆ రైతుల కుటుంబం కన్నీరుమున్నీర వుతోంది.కన్నబిడ్డల్లా సాదుకున్నఎద్ల మృతదేహాల వద్ద వారు పడుతున్న రోదనలు చూపరుల గుండెలను పిండేస్తున్నాయి.వ్యవసాయమే జీవనాధారంగా నమ్ముకున్న ఆ నిరుపేద రైతు కుటుంబానికి ఆ ఎడ్లే సర్వస్వం నాగలి పట్టి పొలం దున్నాలన్నా, బండి కట్టి భారమెయ్యాలన్నా ఆ ఎడ్లే ఆ కుటుంబానికి చేదోడు వాదోడుగా ఉండేవి. లక్షలాది రూపాయల విలువైన ఆ ఎద్లు అకస్మాత్తుగా మృతి చెందడంతో రైతు కుటుంబం ఆర్థికంగా కోలుకోలేని దెబ్బతిన్నది. మా నోటి కాడి కూడును ఆ దేవుడు ఇలా లాగేసుకున్నాడా అంటూ వారు ఆవేదన చెందుతున్నారు. పచ్చని పొలాల్లో పరుగులెత్తాల్సిన ఎద్లు, విద్యుత్ అధికారుల నిర్లక్ష్యమో లేక ప్రకృతి వైపరీత్యమో కానీ, నేల కొరిగి ఆ కుటుంబంలో చీకట్లు నింపాయి.ప్రభుత్వం స్పందించి, సర్వం కోల్పోయిన ఆ పేద రైతును ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## వైభవంగా ముత్యాలమ్మ, బొడ్రాయి ప్రతిష్ఠాపన

- బొడ్రాయి,ముత్యాలమ్మ దేవతలను దర్శించుకున్న ఎమ్మెల్యే కోరం





**టేకులపల్లి,మే09,ప్రజాజ్యోతి :** మండలంలోని బోడు గ్రామంలో శనివారం గ్రామ రక్షణకు, గ్రామ అష్టైశ్వర్యాలు సిద్ధికి బొడ్రాయి గౌరీ శీతలమాత,ముత్యాలమ్మ తల్లి,గ్రామదేవతల ప్రత్యేక పూజలు శాస్త్రోక్తంగా వైభవంగా నిర్వహించారు. బోడు గ్రామస్తుల ఆహ్వానం మేరకు స్థానిక ఎమ్మెల్యే కోరం కనకయ్య హాజరై ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతిష్ఠమహోత్సవానికి బంధు మిత్రులు అధిక సంఖ్యలో తరలి రావడంతో బోడు గ్రామ అంతభక్తులతో కళకళలాడు తుంది అని అన్నారు. గ్రామస్తులు సుఖ సంతోషాలతో, అష్టైశ్వర్యాలతో అందరూ సుఖంగా ఉండాలని కోరుకుంటున్నారని తెలిపారు.బోడు ఎస్సై పి. శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు. ఈ కార్యక్రమంలో టేకులపల్లి సిఐ బత్తుల సత్యనారాయణ, టేకులపల్లి ఎస్సై రాజేందర్, ఇల్లందు నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు కోరం సురేందర్, మండల నాయకులు ఇది గణేష్, పోశాలు, సర్దార్, సుదీప్, బోడు సర్పంచ్ స్థానిక నాయకులు,గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



# తుమ్మల... సేవ కు @40



- ప్రజా రాజకీయాల్లో అరుదైన అధ్యాయం
- రాజకీయంలో అవినీతి మచ్చపడని నేత
- 4గురు ముఖ్యమంత్రుల దగ్గర 20 సంవత్సరాల మంత్రిగా పనిచేసిన చరిత్ర
- ఉమ్మడి ఖమ్మం జిల్లాలో మారుమూలకి వెళ్లిన తుమ్మల చేసిన అభివృద్ధి కనిపిస్తుంది
- రైతు బంధువుగా "ఆయిల్ పామ్" తో రైతును రాజుగా నిలిపిన రైతన్న

**తుమ్మల నాగేశ్వరరావు పేరు వినగానే ప్రజలకు గుర్తు కొచ్చేది అభివృద్ధి, నిబద్ధత, నిరాడంబర రాజకీయాలు. నాలుగు దశాబ్దాల రాజకీయ ప్రస్థానంలో ఎన్నో పదవులు చేపట్టినా, అవినీతి మచ్చ పడకుండా ప్రజల మనసుల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకున్న నేతగా తుమ్మల నిలిచారు. అధికారాన్ని ఆస్తిగా కాకుండా, సేవకు సాధనంగా భావించిన ఆయన ప్రయాణం నేటి రాజకీయాల్లో అరుదైన ఉదాహరణగా నిలుస్తోంది.**

అశ్వారావుపేట, ప్రజాజ్యోతి









ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని మారుమూల గ్రామాల వరకూ వెళ్లిన ప్రతి రహదారి, నిర్మించిన ప్రతి కాలువ, ఏర్పాటు చేసిన ప్రతి అభివృద్ధి పనిలో తుమ్మల ముద్ర స్పష్టంగా కనిపిస్తుంది. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే అసలైన ప్రగతి అన్న నమ్మకంతో పని చేసిన ఆయన, పల్లెలను పట్టణాలకు తగ్గట్టుగా తీర్చిదిద్దేందుకు విశేష కృషి చేశారు. ముఖ్యంగా రవాణా, సాగునీరు, విద్య, వైద్య రంగాల్లో ఆయన చేసిన సేవలను ప్రజలు ఇప్పటికీ గుర్తు చేసుకుంటున్నారు. రాజకీయ జీవితంలో దివంగత ముఖ్యమంత్రి యన్.టి.రామారావు, ప్రస్తుత ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కే చంద్రశేఖర రావు, ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో సహా నాలుగురు ముఖ్యమంత్రుల కేబినెట్‌లో దాదాపు 20 సంవత్సరాలు మంత్రిగా పనిచేయడం ఆయన రాజకీయ సామర్థ్యానికి నిదర్శనం. ఏ శాఖ బాధ్యతలు చేపట్టినా పరిపాలనలో తనదైన ముద్ర వేసి, ప్రజల అవసరాలను ముందుంచి పనిచేశారు. అధికారంలో ఉన్నా, లేకున్నా ప్రజల మధ్యే ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేయడం తుమ్మల ప్రత్యేకతగా మారింది. రైతు సంక్షేమాన్ని రాజకీయాల కంటే గొప్ప బాధ్యతగా భావించిన తుమ్మల, "ఆయిల్ పామ్" సాగును ప్రోత్సహిస్తూ వేలాది మంది రైతుల జీవితాల్లో వెలుగులు

నింపారు. పంటలకు గిట్టుబాటు ధరలు, స్థిరమైన ఆదాయం అందేలా కృషి చేస్తూ రైతును ఆర్థికంగా బలపరిచే దిశగా అడుగులు వేశారు. అందుకే రైతులు ఆయనను "రైతు బంధువు"గా అభివర్ణిస్తుంటారు. ఆయిల్ పామ్ సాగుతో అనేక కుటుంబాలు ఆర్థికంగా నిలదొక్కుకోవడం ఆయన దూరదృష్టికి నిదర్శనంగా నిలిచింది. ప్రజా జీవితంలో 40 ఏళ్ల ప్రస్థానం పూర్తిచేసుకున్న ఈ సందర్భంగా తుమ్మల సేవలను పలువురు ప్రజాప్రతినిధులు, రైతు సంఘాలు, అభిమానులు స్మరించుకుంటున్నారు. రాజకీయాల్లో విలువలు తగ్గుతున్న ఈ కాలంలో కూడా నిష్కళంక సేవతో ప్రజల హృదయాల్లో స్థానం సంపాదించిన తుమ్మల వంటి నేతలు సమాజానికి ఆదర్శమని వారు అభిప్రాయపడుతున్నారు.

**ఆయిల్ ఫామ్ అభివృద్ధిలో తుమ్మల ఓ శాస్త్రవేత్త.... బండి పుల్లారావు.... ఆయిల్ ఫామ్ రైతు**



రాష్ట్రంలో ఆయిల్ ఫామ్ సాగు అభివృద్ధికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శాస్త్రీయ దృక్పథంతో ముందుకు సాగుతున్నారన్నారు. ఆయిల్ ఫామ్ సాగును లాభదాయక పంటగా మార్చేందుకు ఆయన తీసుకుంటున్న చర్యలు రైతుల్లో నూతన ఆశలు రేకెత్తిస్తున్నాయన్నారు. రైతులకు అధిక దిగుబడులు వచ్చే విధంగా నాణ్యమైన మొక్కల పంపిణీ, ఆధునిక సాగు పద్ధతులపై అవగాహన కార్యక్రమాలు, నీటి నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టడం వంటి అంశాల్లో తుమ్మల చొరవ చూపుతున్నారని చెప్పారు. అలాగే ఆయిల్ ఫామ్ పంటకు మార్కెట్ సౌకర్యాలు కల్పించడం, ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు ప్రోత్సాహం ఇవ్వడం ద్వారా రైతుల ఆదాయం పెంచే దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. వ్యవసాయ రంగంపై పూర్తి అవగాహనతో శాస్త్రవేత్తలా పనిచేస్తున్న తుమ్మల నాయకత్వంలో ఆయిల్ ఫామ్ సాగు రాష్ట్రంలో మరింత విస్తరించే అవకాశాలు ఉన్నాయన్నారు.

**మచ్చలేని నాయకుడు తుమ్మల.. నిర్మల పుల్లారావు డిసిసిబి డైరెక్టర్**



తుమ్మల నాగేశ్వరావు గురించి చాలా మంది "మచ్చలేని నాయకుడు" అని మాట్లాడటానికి ప్రధాన కారణం ఆయనకు ఉన్న పరిపాలనా అనుభవం, అభివృద్ధి పనులపై పట్టు , వ్యక్తిగతంగా సరళమైన వ్యక్తిత్వం కలిగిన నాయకుడవటం. ముఖ్యంగా రోడ్లు, సాగునీరు, రవాణా, వ్యవసాయం వంటి శాఖల్లో పనిచేసినప్పుడు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తారని, అందుకే రాజకీయాల్లో "మచ్చలేని నేత" అనే అభిప్రాయం ప్రజల్లో ఉంది.అభిమానులు ఆయనను నిజాయితీ గల నాయకుడిగా చూస్తారు.

**అభివృద్ధి ప్రదాతగా తుమ్మలకు ప్రజల ప్రశంసలు... మొగళ్ళపు చెన్నకేశవ రావు ఆయిల్ ఫామ్ రైతు**



ఉమ్మడి ఖమ్మం జిల్లా అభివృద్ధికి కృషి చేస్తూ ప్రజల మనసులు గెలుచుకుంటున్న నాయకుడు తుమ్మల.. రహదారులు, తాగునీరు, విద్యా, వైద్య రంగాల అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ చూపారు. గ్రామీణాభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలులో ఆయన చూపుతున్న చొరవకు అన్ని వర్గాల ప్రజలు నుంచి ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి.

**నిత్యం ప్రజల్లో ఉండే నాయకుడు తుమ్మల.... చిన్నంశెట్టి సత్యనారాయణ... సొసైటీ చైర్మన్.. అశ్వారావు పేట**



ప్రజల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ముందుకు సాగుతున్న నాయకుడు తుమ్మల నాగేశ్వరరావు, గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాల వరకు ప్రజల మధ్య నిరంతరం తిరుగుతూ వారి సమస్యలను స్వయంగా తెలుసుకుంటూ స్పందించడం ఆయన ప్రత్యేకతగా ప్రజలు చెప్పుకుంటారు. ఎప్పటికప్పుడు ప్రజలతో మమేకమవుతూ అభివృద్ధి కార్యక్రమాలపై దృష్టి సారిస్తున్న తుమ్మల, సాధారణ కార్యకర్తలకు కూడా అందుబాటులో ఉండే నాయకుడిగా గుర్తింపు పొందారు. ప్రజా సమస్యలపై వెంటనే స్పందించి ఎప్పటికప్పుడు అధికారులతో చర్చించడం, అభివృద్ధి పనులను వేగవంతం చేయడం ద్వారా ప్రజల్లో విశ్వాసాన్ని పెంచుకుంటున్నారు.

# 11 వ తేదీన ఏఐయుకెఎస్ జాతీయ మహాసభలు జయప్రదం చేయండి

- మహాసభల కరపత్రాలు ఆవిష్కరణ



**టేకులపల్లి, మే09,ప్రజాజ్యోతి :** టేకులపల్లి మండలం కొండంగుల బోడు గ్రామంలో సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ ఇల్లందు డివిజన్ నాయకులు జరుపుల సుందర్ ఆధ్వర్యంలో శనివారం ఉపాధి హామీ కార్మికుల సమక్షంలో ఏఐయుకేఎస్ జాతీయ మహాసభల కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో నరేంద్ర మోడీ బిజెపి కేంద్ర ప్రభుత్వం. చేస్తున్న రైతాంగ కార్మిక వ్యతిరేక చట్టాలను తిప్పి కొట్టాలని మన దేశంలో కోట్లాది మంది రైతులు అన్నదాతలు ప్రస్తుతం ప్రధానంగా మోడీ ప్రభుత్వం ఆవలంబిస్తున్న అతి సంపన్న అనుకూల విధానాల కారణంగా మన ప్రియతమ అన్నదాతలు తీవ్రమైన సంక్షోభంలో చిక్కుకున్నారు. ఈ సంక్షోభానికి అత్యంత భయంకరమైన నిదర్శనం ఐదు లక్షల మందికి పైగా అన్నదాతల ఆత్మహత్యలు సగటున మనదేశంలో ప్రతిరోజు 48 మంది రైతులు ప్రాణాలు తీసుకుంటున్నారు. ఎందుకు అవసరానికి మించి ఆహార ధాన్యాలను ఉత్పత్తి చేసేవారు. కార్మిక వర్గం మరియు కష్టజీవుల తో సహా ప్రజలందరికీ ఆహారాన్ని అందించేవారు ఆత్మహత్యల వైపు ఎందుకు నెట్టబడుతున్నారో అని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ మహాసభలో అన్ని కార్మిక వర్గం రైతాంగ రైతు కూలీల ఐక్యం చేసుకొని ముందుకు కొనసాగుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న ప్రజా వ్యతిరేక కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా రైతులు రైతు కూలీలు కార్మికులు ఏకం కావాలని వారు అన్నారు. ఈనెల 11 తారీఖున జరుగు భారీ ప్రదర్శన బహిరంగ సభ కు 600 మంది ప్రజా కళాకారులు డప్పు డాన్సు కోలాటంతో మారి మోగిపోతుంది ఇల్లందు పట్టణం. కావున కార్మికులు రైతులు రైతు కూలీలు అన్ని వర్గాల ప్రజలు జరుగు ప్రదర్శన బహిరంగ సభ కు భారీ ఎత్తున కదిలి రావాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో డి. బద్య,బి.లింగ,జె.విమల,జి. రమేష్,జి.సావిత్రి, బి.లచ్చి,జి.చిన్ని,బి. బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

# కుమ్మరుల అభివృద్ధికి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

- జిల్లా అధ్యక్షులు బాడిషా శంకర్రావు



**పాల్వంచ, మే 9, ప్రజాజ్యోతి:** రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం పలు పథకాలను అమలు చేస్తున్న కాంగ్రెస్ ప్రభు త్వం, కుమ్మరుల అభివృద్ధి కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కుమ్మరి సంఘం జిల్లా అధ్యక్షులు బాడిషా శంకర్రావు ప్ర భుత్వాన్ని కోరారు. శనివారం విడుదల చేసిన ఓ ప్రకటనలో ఆయ న మాట్లాడుతూ, సమాజంలోని అన్ని వర్గాల ప్రజలకు కుమ్మరి వృత్తితో విడదీయరాని సంబంధం ఉందన్నారు. అలాంటి సంప్రదాయ వృత్తిని పరిరక్షించేందుకు కుమ్మరులకు మట్టి కోసం ప్రత్యేకంగా చెరువులను కేటాయించాలని డిమాండ్ చేశారు. గతంలో కుమ్మరుల అవసరాల కోసం కేటాయించిన చెరువులు పలుచోట్ల కబ్జాకు గురయ్యాయని, వాటిపై సమగ్ర విచారణ జరిపించి తిరిగి స్వాధీనం చేసుకుని కుమ్మరులకు అప్పగించాలని ప్రభుత్వాన్ని కోరారు. అలాగే, కుమ్మరి సంఘం కార్పొరేషన్ ఏర్పాటు చేసి రుణ సదుపాయాలు కల్పించడం ద్వారా కులవృత్తినే నమ్ముకుని జీవనం సాగిస్తున్న నిరుపేద కుమ్మరులను ఆర్థికంగా ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ నెల 17వ తేదీన ఆదివారం హైదరాబాద్‌లోని ఉస్మానియా క్యాంపస్‌లో కుమ్మరి సంఘం రాష్ట్ర అధ్యక్షులు నడికుడి జయంతిరావు ఆధ్వర్యంలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి సమావేశానికి జిల్లా కార్యవర్గ సభ్యులు, సంఘ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని బాడిషా శంకర్రావు పిలుపునిచ్చారు.

# అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడి జీవితాలను నాశనం చేసుకోవద్దు

- భద్రాచలం డిఎస్పీ అరుణ్ కుమార్



**భద్రాచలం, మే 9, ప్రజా జ్యోతి:** యువత అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడి తమ జీవితాలను నాశనం చేసుకోవద్దని భద్రాచలం డిఎస్పీ అరుణ్ కుమార్ అన్నారు. భద్రాచలంలో శనివారం రాజీవ్ నగర్ కాలనీ, మను బోతుల చెరువు డబుల్ బెడ్ రూమ్ కాలనీల్లో కమ్యూనిటీ కనెక్ట్ ప్రోగ్రాం ను నిర్వహించారు. ఇందులో భాగంగా మొత్తం సుమారుగా 300 ఇండ్లలో సోదాలు నిర్వహించి సరిగా పత్రాలు, నంబర్ ప్లేట్స్ లేని 30 ద్విచక్ర వాహనాలను,05 ఆటోలను,సీజ్ చేసి సుక్మా జిల్లాకు చెందిన ఆరుగురు అనుమానితులను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం కాలనీల్లో నివసించే స్థానికులతో సమావేశాన్ని ఏర్పాటు చేసి డిఎస్పీ పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ అరుణ్‌కుమార్ మాట్లాడుతూ చట్ట,వ్యతిరేక, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తుల గురించి సమాచారం తెలిస్తే వెంటనే పోలీసు వారికి సమాచారం అందించాలని కోరారు. తమ ప్రాంతంలో ఎలాంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకువస్తే సంబంధిత అధికారులతో మాట్లాడి వాటి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. మట్కా, జూదం, కోడిప ందాలు, బెట్టింగ్, గ ంజాయి రవాణా వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై ప్రత్యేకంగా నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తమ కాలనీల్లోకి కొత్తగా ఎవరైనా వ్యక్తులు అద్దెకు వస్తే, ఇంటి యజమానులు వారి ఆధార్ కార్డు,చిరునామాలను సేకరించి పెట్టుకోవాలని సూచించారు. నేరాల నియంత్రణ కొరకు తమ నివాస ప్రాంతాలలో సీసి కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సుమారుగా 100 మందికి పైగా పోలీస్ అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం సీఐ నాగరాజు,ఎస్సైలు తిరుపతి,స్వప్న, రామకృష్ణ, సీఆర్పిఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

# గోదావరి స్నానాల రేవులో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం



**భద్రాచలం, మే 9, ప్రజా జ్యోతి:** భద్రాచలం గోదావరి స్నానాల రేవు వద్ద హనుమాన్ మాల ధారణలో ఉన్న గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం కనిపించడం కలకలం రేపింది. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించగా వారు ఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరిస్తున్నారు. స్నానం చేస్తున్న సమయంలో ఫిట్స్ (మూర్ఛ) వచ్చి నీటిలో మునిగి ఉండొచ్చనే అనుమానం వ్యక్తమవుతోంది. మృతుడి వివరాలు ఇంకా తెలియరాలేదు. భద్రాచలం ఎస్సై శ్యాం కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

# వర్షాకాలానికి ముందే కాలువల మరమ్మతులు చేపట్టాలి

- కార్పొరేటర్ చింతలపూడి శ్రావణి



**సుజాతనగర్, మే 9 (ప్రజాజ్యోతి) :** ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక వారోత్సవాల్లో భాగంగా శనివారం మండలంలోని సింగభూపాలెం చెరువు ప్రాంతంలో నీటి పారుదల శాఖ ఆధ్వర్యంలో రైతు వారోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివ రావు, మేయర్ మూడ్ గణేష్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ కార్యక్రమంలో కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ 21వ డివిజన్ కార్పొరేటర్ చింతలపూడి శ్రావణి మాట్లాడుతూ వర్షాకాలం ప్రారంభానికి ముందే కాలువలకు మరమ్మతులు చేపట్టి రైతులకు సాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. చెరువు కట్ట కుంగిన ప్రాంతాల్లో తక్షణమే మరమ్మతులు చేపట్టి రక్షణ గోడ నిర్మించి కట్టను బలోపేతం చేయాలని సూచించారు.అలుగు వరదల కారణంగా పంట పొలాలు మునిగిపోకుండా ముందస్తు రక్షణ చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. చెరువులో పేరుకుపోయిన సారవంతమైన మట్టిని రైతులు తమ వ్యవసాయ భూములకు తరలించుకొని భూసారాన్ని పెంచుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ శాఖ అధికారులు, వ్యవసాయ శాఖ సిబ్బంది, ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీనివాసకాలనీలో ఘనంగా బొడ్రాయి, ముత్యాలమ్మ విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు

- ప్రత్యేక పూజల్లో పాల్గొన్న డీసీఎంఎస్ మాజీ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు





**పాల్వంచ, మే 9, ప్రజాజ్యోతి:** పాల్వంచ పట్టణ పరిధిలోని 8వ డివిజన్ శ్రీనివాసకాలనీలో బొడ్రాయి, ముత్యాలమ్మ విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ నెల 7వ తేదీ నుంచి 10వ తేదీ వరకు జరుగుతున్న పూజా కార్యక్రమాల్లో భాగంగా శనివారం విగ్రహ ప్రతిష్ఠాపనతో పాటు పోతురాజు దేవతా యాత్ర ప్రతిష్ట కార్యక్రమాలను గ్రామస్థులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.ప్రత్యేక పూజలు, హోమాలు, మంగళహారతులతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక వాతావరణంతో కళకళలాడింది. రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ డైరెక్టర్, డీసీఎంఎస్ మాజీ చైర్మన్, పాల్వంచ సొసైటీ అధ్యక్షులు కొత్వాల శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొని ఆశీస్సులు అందుకున్నారు.

**5 వేల మంది భక్తులకు అన్నసంతర్పణ....** ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో సుమారు 5 వేల మంది భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ అన్నదాన కార్యక్రమాన్ని కొత్వాల శ్రీనివాసరావు ప్రారంభించారు. భక్తులు భారీ సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు కందుకూరి రాము, పులి సత్యనారాయణ, రామచంద్రారెడ్డి, ఉట్ల సీతారాములు, తాండూరు రాంబాబు, కాకాటి రవీందర్, కుంపటి శివ, పరిమి వెంకన్న, రేనాటి మాధవరావు, మండల కాంగ్రెస్ అధ్యక్షులు కోండం వెంకన్న, పట్టణ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు పైడిపల్లి మహేష్ తదితరులు పాల్గొన్నారు.